క్లుప్తంగా

అయ్యప్ప మాలధారులకు సద్ది

దాచేపల్లి: అయ్యప్పస్వామి మాలధారులకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ కుటుంబ సభ్యులు బుధవారం సద్ది ఏర్పాటు చేశారు. స్థానిక వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో చైర్‌పర్సన్ సుబ్బమ్మ భర్త సాంబయ్య, కుమారుడు రవి, కృష్ణ తదితరులు అంకమ్మతల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పీఠం వద్ద కూడా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు ఏర్పాటు చేసిన సద్దిని వడ్డించారు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వారు కోరుకున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

సీఐ శ్రీరాం వెంకట్రావు



పిడుగురాళ్ల: మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణ పరిధిలో గత వారం రోజులుగా మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మంది వాహనదారులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచటం జరిగిందని వారికి రూ.లక్ష అపరాధ రుసుం కోర్టు జరిమానాగా విధించిందని ఆయన తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపటం వలన ఎన్నో అనర్థాలు జరుగుతాయని, దీనిని గుర్తు పెట్టుకొని మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ఉన్నారు.

గురజాల సీఐగా భాస్కర్ బాధ్యతల స్వీకరణ



గురజాల: పట్టణ సీఐగా ఆవుల భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా విధులు నిర్వహించిన భాస్కర్ సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్లిపోయారు. ఐజీ ఉత్తర్వుల మేరకు గురజాల సీఐగా ఆవుల భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉండి సమస్యలు పెండింగ్ లేకుండా చూస్తానన్నారు. ఆయనను పలువురు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మరుగుదొడ్ల వారోత్సవాలు



కారెంపూడి: మరుగుదొడ్డి లేని వారు దరఖాస్తు చేసుకోవాలని స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు కోరారు. మండలంలోని చింతపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం మరుగుదొడ్ల వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్సీ కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్డి లేని ఇల్లు ఉండకూడదని లేని వారు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులచే మానవహారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మిరపలో సరైన యాజమాన్యంతో అధిక దిగుబడులు

మాచవరం: మిరపలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి తెగుళ్లు, కీటకాలను గుర్తించి యాజమాన్య పద్ధతులు పాటించి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని జర్మనీకి చెందిన జీవాగ్రో లిమిటెడ్ ప్రతినిధి డైకిసన్ అన్నారు. మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో జీవాగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో మిరప సాగుపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ సంస్థ ద్వారా ఆర్మచురా అనే ప్రత్యేకమైన మందును అందించడం జరిగిందని, దాని ద్వారా రసాయన అవశేషాలు లేని పంట దిగుబడి, ఆరోగ్యకరమైన పంటను రైతు సాగు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జీవాగ్రో రీజనల్ మేనేజర్ బ్రహ్మయ్య, మార్కెటింగ్ మేనేజర్ రవికుమార్, షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. స్థానిక కల్యాణి రెస్టారెంట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో పిడుగురాళ్లకి చెందిన కుక్క మూడి బుజ్జిబాబు(45) మృతి చెందినట్లు ఎస్‌ఐ పాపారావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. టెంట్ హౌస్ పనుల నిమిత్తం పిడుగురాళ్ల నుంచి దాచేపల్లికి వెళ్లిన బుజ్జిబాబు పనులు ముగించుకుని టాటా ఏస్ వాహనంలో ఇంటికి వెళుతున్నాడు. అది పంక్చర్ అవడంతో దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ అతివేగంతో వచ్చి ఢీ కొట్టింది. దీంతో బుజ్జిబాబు ఘటన స్థలంలోనే మృత్యువాతపడ్డాడు. ఎస్‌ఐ పాపారావు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అందని బిల్లులు.. నిలిచిన నిర్మాణాలు

- పేదల గూడుపై కూటమి వివక్ష
- జగనన్న కాలనీల్లో సదుపాయలు అధ్వానం
- తాగునీరు, రోడ్లు లేక ఇక్కట్లు
- కూటమి సర్కార్‌లో పేదింటి గృహాలకు గ్రహణం



దాచేపల్లి జగనన్న కాలనీలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

దాచేపల్లి: పేదల ఇళ్లపై కూటమి సర్కార్ వివక్ష చూపిస్తుంది. ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ పేదల ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆశక్తిని చూపించి సకాలంలో ఇళ్లు నిర్మించుకున్నారు. కూటమి సర్కార్ వచ్చిన తరువాత బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుంది. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు ఇస్తారో.. లేదో అనే భయం లబ్ధిదారులను వెంటాడుతోంది. కూటమి సర్కార్ చర్యలతో పేదింటి గూడు నిర్మాణాలపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి.

ఇసుక అందుబాటులో లేక...

అధికారంలోకి వచ్చిన తరువాత పేదల ఇళ్లపై కూటమి సర్కార్ వివక్ష చూపిస్తుంది. ఇళ్ల నిర్మాణాలపై స్పష్టమైన వైఖరి అవలంభించటం లేదు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తోంది. దీంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావటంలేదు. అప్పులు చేసి ఇల్లు కట్టుకుంటే బిల్లులు రావనే ఆందోళన లబ్ధిదారులను వెంటాడుతోంది. దీనికి తోడు ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి సర్కార్‌లో టన్ను ఇసుక రూ.2 వేలకు పైగా చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రెండో విడతలో 2 వేల మందికిపైగా పట్టాలు

దాచేపల్లిలో 2 వేల మందికి పైగా రెండో విడతలో నిరుపేదలకు ఇంటి పట్టాలను గత ప్రభుత్వం ఇచ్చిన తరువాత ఎన్నికల కోడ్ రావటంతో లే అవుట్‌లో స్థలాలు చూపించలేదు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత నేటి వరకు నిరుపేదలకు ఇంటి స్థలాలు చూపించేందుకు చర్యలు తీసుకోకపోవటం గమనార్హం. పేదల సొంతింటి కలను కలగానే కూటమి సర్కార్ మిగిల్చింది. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి సరైన వసతులు కూడా కల్పించటం లేదు. వీధుల వెంట పిచ్చిచెట్లు మొలిచాయి. మంచినీటి ట్యాంక్‌లు అధ్వానంగా ఉన్నాయి. కరెంట్ సమస్యలు ఉండటంతో రాత్రి సమయాల్లో వీధుల్లోకి రాలేని పరిస్థితి. కూటమి సర్కార్ ఇప్పటికైనా స్పందించి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 1,516 ఇళ్లు మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు అడుగులు వేశారు. అర్హతే ఆధారంగా నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో ఏడు జగనన్న కాలనీల్లో తొలి విడతలో 1,977 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేయగా 1,516 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 905 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మిగతా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు రూ.13 కోట్లకు పైగా బిల్లులు సకాలంలో చెల్లించి సిమెంట్, ఇసుక, ఐరన్ అందించింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరిగి నిరుపేదల సొంతింటి కల సాకారం అయింది.

వసతులు కల్పించాలి



జగనన్న కాలనీలో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారంతా కాలనీలోనే నివాసం ఉంటున్నారు. తాగునీరు అందించాలి. అధ్వానంగా ఉన్న రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టాలి. పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపించాలి. ఇళ్లు నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లించాలి.

– కొమ్ము బుజ్జి, లబ్ధిదారు, దాచేపల్లి

ఇళ్ల నిర్మాణాలు జరిపిస్తాం

ప్రభుత్వం మజూరు చేసిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం కూడా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు తగినట్లు తాము కూడా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్ల నిర్మాణాలు జరిగితే బిల్లులు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్, ఏఈ, గృహ నిర్మాణ శాఖ, దాచేపల్లి

ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం చొరవ చూపాలి



నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా కూటమి సర్కార్ చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలి. అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదల ఇళ్లపై వివక్ష చూపించవద్దు. దాచేపల్లి నగర పంచాయతీలో ఎంతో మంది నిరుపేదలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిరుపేదల ఇళ్లపై రాజకీయంగా కక్షసాధింపులు చేయటం మంచి విధానం కాదు.

– ఆంజనేయరాజు, సీపీఎం నాయకులు, దాచేపల్లి



బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన ఇళ్లు



ఇళ్ల మధ్యలో పెరిగిన పిచ్చిచెట్లు



బిల్లులు రాక లింటల్ లెవల్‌లో నిలిచిన ఇళ్లు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



పిడుగురాళ్లరూరల్: మండలంలోని వీరాపురం, తుమ్మలచెరువు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వరి పంట కోసే రైతులతో మాట్లాడి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని తెలియజేశారు. 75 కేజీల బస్తా రూ.1,740కు కొనుగోలు చేయటం జరుగుతుందని తెలిపారు. అమ్మదలచిన రైతులు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. వచ్చే రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పంట కోయదలచిన రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెదకొదమగుండ్లలో రైతు సదస్సు



కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి పి.ప్రవీణ్ మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో బుధవారం రైతు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ శాతం పెరిగిపోతోందని ఇది పంటలకు హాని చేస్తోందన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకం, అలాగే పురుగు మందుల పిచికారీ వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు వాతావరణంలో సమతుల్యత లోపిస్తోందని అన్నారు. ఇది పంటల దిగుబడులపై ప్రభావం చూపుతుందని, పంటలకు తెగుళ్లు వస్తున్నాయని వివరించారు. జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వల్ల 20 శాతం వరకు నత్రజనిని భూమికి అందించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రస్తుత వాతావరణ అసమతుల్యతను అధిగమించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ప్రవీణ్ రైతులను కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ యలమందారెడ్డి

కారెంపూడి: మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి బుధవారం వరి పొలాలను పరిశీలించారు. మండలంలోని ఒప్పిచర్ల, మిరియాల గ్రామాలలో పర్యటించి వరి కోతలను పరిశీలించారు. సన్నాలు ఎకరాకు 35 బస్తాలు, బీపీటీ 40 బస్తాల దాకా గరిష్ఠంగా వస్తున్నాయని బయట మార్కెట్‌లో బస్తా రూ.1,450 దాకా ధర పలుకుతోందని రైతులు ఆయనకు తెలిపారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తుందని ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్ రూ.2,320, సాధారణ రకం రూ.2,300 ప్రభుత్వ మద్దతు ధర ఉందని ఏఓ పేర్కొన్నారు. అయితే తేమ 12 నుంచి 17 శాతానికి మించి ఉండకూడదని ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి పంటలను క్షేత్రస్థాయి పరిశీలించడం జరుగుతుందని ఈ నెల 29 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు ఎవరూ వరి కోతలు కోయవద్దని, అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ దశలో వర్షం పడితే నష్టం ఎక్కువగా ఉంటుందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఓ వెంట ఒప్పిచర్ల ఏఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపైనా ఉండాలి

ఎమ్మెల్యే యరపతినేని



బస్ షెల్టర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గురజాల రూరల్: అమరలింగేశ్వర స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని దైద బిలంలో వేంచేసియున్న అమరలింగేశ్వర స్వామిని బుధవారం ఎమ్మెల్యే యరపతినేని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవాలయం సమీపంలో లేళ్ల రామస్వామి, మంగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు లేళ్ల కృష్ణ ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులున్నారు.

సచివాలయ ఉద్యోగుల బెదిరింపు ధోరణి తగదు

కార్యదర్శుల సంఘ నాయకులు



సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు

మాచర్ల రూరల్: ప్రభుత్వ విధులను సకాలంలో పూర్తి చేయమని ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నందుకు సచివాలయ సిబ్బంది బెదిరింపు ధోరణితో కార్యదర్శులను కించపరుస్తూ ఇబ్బందులకు గురిచేయటం తగదని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామ సచివాలయ సర్వేయర్ ఉద్యోగి కె.ఏసురాజును స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్నుల సర్వే నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదని, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా చేయాలని కోరిన నేపథ్యంలో అతను కార్యదర్శులు మమ్మల్ని బెదిరిస్తున్నారంటూ సూసైడ్ వీడియో తీసి సోషల్ మీడియా గ్రూపుల్లో పెట్టి బెదిరించాలని చూడటం తగదన్నారు. కింది నుంచి పై స్థాయి ఉద్యోగుల వరకు ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలని, ఉద్యోగంలో ఎవరికైనా ఒత్తిడులు సహజమని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తే ఎవరికీ ఇబ్బందులుండవన్నారు. ఇప్పటికే కార్యదర్శుల కొరతతో ఒక్కొక్కరం ఐదు పంచాయతీలకు విధులు నిర్వహిస్తున్నామని, పని భారంతో మేము కూడా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నామని, ప్రభుత్వం స్పందించి మమ్మల్ని కూడా అదనపు బాధ్యతల నుంచి తప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ సంఘం అధ్యక్షులు టి.పి.సత్యనారాయణ, బిట్లు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకట్రామయ్య, వై.శ్రీనివాసరావు, యెల్లెబోయిన కోటేశ్వరరావు, సుజాత తదితరులున్నారు.

ఓటర్ జాబితా సవరణకు దరఖాస్తు చేసుకోండి

దుర్గి: ఏపీ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు ఓటర్ జాబితాలో చేర్పుల కోసం దరఖాస్తులను సమర్పించాలని తహసీల్దార్ ఫణికుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం 6ను సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరణించిన వ్యక్తులు, డ్యూప్లికేట్ ఎంట్రీలు, వివాహం అయి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, శాశ్వత వలసల కారణంగా ఓట్లను తొలగించుటకు ఫారం 7 ఇవ్వాలన్నారు. పేరు, చిరునామా తదితర మార్పులు చేర్పులకు ఫారం 8ను అందించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ బీఎల్వోల వద్ద ఓటర్ జాబితాలో వివరాలను ధ్రువీకరించుకోవాలన్నారు. ఓటరు లబ్ధిదారులందరూ నేటి సాయంత్రం లోపు దరఖాస్తులు అందించాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ



గురజాల గాంధీబొమ్మ సెంటర్‌లో బాల్య వివాహాలపై నిర్వహించిన మానవహారం

పిడుగురాళ్ల: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరు అరికట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీ గంగాధర్‌రావు అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను ప్రతి బాలుడు, బాలిక తెలుసుకోవాలని, తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి, సెక్రటరీ కోపూరి వెంకటేశ్వర్లు, న్యాయవాది మందా జాకబ్, పారా లీగల్ వలంటీర్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ లింగాల ధనలక్ష్మి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

గురజాల: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సీడీపీవో షేక్ రుక్సానా సుల్తానా బేగం అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో బాల్య వివాహాలపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన బాలికలకు జరిగే అనార్థల గురించి వివరించారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే సత్వరమే మా దృష్టికి తీసుకురావాలన్నారు. వివరాలు తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రధాన కూడళ్లలో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వై.రత్నకుమారి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలి

పిడుగురాళ్ల: బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహ ముక్తి భారత్‌లో భాగంగా ఈ అవగాహన కల్పించామని తెలిపారు. విద్యార్థులు సైతం బాల్య వివాహాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని, తల్లిదండ్రులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

మాచర్ల రూరల్: బాల్య వివాహాలను అరికట్టి బాలికా విద్య, భద్రత కోసం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్ నాయక్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అంగన్‌వాడీ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రపదేశ్‌గా నిర్మిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లీలావతి, దుర్గాంబ, జ్యోతి, ఎంఈఓ అల్లి సురేష్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, లాయర్ నరసింహారెడ్డి, అంగన్‌వాడీ ఉద్యోగులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్

కారెంపూడి: బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్లు బుధవారం కారెంపూడిలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మానవహారంగా ఏర్పడి తర్వాత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. బాలికల విద్య ఇంటికే వెలుగు అవుతుందని ఆడబిడ్డలను చదివిద్దామని, బాల్య వివాహాలను అరికడదామని నినాదాలు చేశారు. ఏపీని బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తయారు చేసుకుందామని అందుకు తల్లిదండ్రులు సహకరించాలని బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యానేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి అన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ ఫణికుమార్, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు తదితరులు



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు

వేణుగోపాలస్వామి దేవాలయంలో అన్నదానం



మాచర్ల రూరల్: శివుని ప్రీతిపాత్రమైన కార్తిక మాసంలో ప్రముఖ దేవాలయాల్లో ఎరీస్ ఆగ్రోస్ కంపెనీ లిమిటెడ్ స్థాపించి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని జమ్మలమడక గ్రామంలోని ప్రముఖ వేణుగోపాలస్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద ప్రజలకు దేవాలయాల్లో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు జి.అమరయ్య, రాజేష్, ఎస్.శ్రీనివాసరావు, రామిరెడ్డి, వేణుగోపాలరెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.